# ప్రధాన నగరాలకు దీటుగా భూపాలపల్లి అభివృద్ధి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

- మళ్లీ అవకాశం ఇస్తే 50 ఏళ్ల మాస్టర్ ప్లాన్
- ఆలోచించి ఓటు వేయండి
- సానుభూతి చూపిస్తే మళ్లీ పాత రోజులే
- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 28(నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి పట్టణాన్ని ప్రధాన నగరాలకు దీటుగా అభివృద్ధి చేశానని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2009లో భూపాలపల్లి ఎమ్మెల్యేగా 2014 వరకు కొనసాగనని, ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానన్నారు. అప్పటి వరకు భూపాలపల్లిలో ఎలాంటి అభివృద్ధి లేదని, తాను గెలిచాక భూపాలపల్లిని మున్సిపాలిటీగా చేయడంతో పాటు ఇంటర్, డిగ్రీ, ఐటీఐ కళాశాలలను నెలకొల్పానని అన్నారు. సింగరేణి కార్మికులకు వెయ్యి క్వార్టర్లు నిర్మించానని, రోడ్లు అభివృద్ధి చేశానని చెప్పారు. 2018లో ఎమ్మెల్యేగా గెలుపొంది మెడికల్ కళాశాల ఏర్పాటు చేశానని, గోరికొత్తపల్లిని మండలంగా ప్రకటించామన్నారు. భూపాలపల్లి, చిట్యాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు వేశామన్నారు. భూపాలపల్లిలో 100 పడకల ఆస్పత్రుల నిర్మాణం, 500 పడకలకు అప్‌గ్రేడ్, ఇంటింటికి గోదావరి జలాలు, బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.135కోట్లు మంజూరు, పేదలకు 960 డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ, ప్రధాన రహదారి నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, ఎస్పీ కార్యాలయం, కలెక్టరేట్ ఏర్పాటు, తాగునీటి కోసం చెక్‌డ్యాంల నిర్మాణం, పోడు భూములకు పట్టాలు, ప్రతి మండల కేంద్రానికి డబుల్ బీటీ రోడ్ల నిర్మాణం, గోదాంలు, సబ్ స్టేషన్లు, వాగులపై వంతెనల నిర్మాణం, భూపాలపల్లిలో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం, కార్మికులకు డబుల్ బెడ్‌రూం క్వార్టర్లు, కుల సంఘాలకు ఆత్మ గౌరవ భవనాల నిర్మాణం, ఆటోయూనియన్‌కు స్థలం కేటాయింపు, మొగుళ్లపల్లి, టేకుమట్లలో పోలీసు స్టేషన్లు, వందలాది కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పట్టణంలో వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం, జీఎంఆర్ఎం ట్రస్టు ద్వారా వేలాది మందికి గ్రూప్సులో శిక్షణ, యువతకు డ్రైవింగ్‌లో శిక్షణ, లైసెన్సుల పంపిణీ, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మళ్లీ గెలిస్తే భూపాలపల్లిలో మైనింగ్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాల, పట్టణానికి మాస్టర్ ప్లాన్, నిరుద్యోగుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, ఇంజినీరింగ్ పట్టభద్రుల కోసం ఐటీ సెంటర్ ఏర్పాటు, దేవాదుల పైపులైన్లను డీబీఎం 38తో అనుసంధానం చేసి నియోజకవర్గంలో సంపూర్ణంగా సాగునీరందించడం, చిట్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, రేగొండ, శాయంపేట, మొగుళ్లపల్లి పీహెచ్‌సీలను 30 పడకల ఆస్పత్రిగా మార్చడం, రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో వ్యవసాయం చేసేలా ప్రోత్సహించడం, గోరికొత్తపల్లిలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడం, అర్హులకు దళిత, బీసీ బంధు అందేలా చూస్తానన్నారు. ప్రతీ మొహంలో సంతోషం కోసం ప్రతీ గడపకు సంక్షేమం కోసం, ప్రతి గ్రామంలో అభివృద్ధి కోసం బీఆర్ఎస్‌ను ఆదరించాలని కోరారు. బ్యాలెట్ బాక్స్‌లో మూడో నంబర్ కారు గుర్తుపై ఓటేసి తనను అధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సానుభూతి చూపిస్తే మళ్లీ పాత రోజులే వస్తాయని గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేశ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గులాం అఫ్జల్, మండల మాజీ అధ్యక్షుడు మందల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజుగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పైడిపల్లి రమేశ్, కోల రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.



కాటారం : ప్రచారంలో మాట్లాడుతున్న పుట్ట మధు

## కాంగ్రెస్‌ను నమ్మితే చిమ్మ చీకట్లే

- ఆదరించి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

కాటారం/మల్హర్, నవంబర్ 28 : కాంగ్రెస్‌ను నమ్మితే చిమ్మ చీకట్లేనని, బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మంథని నియోజకవర్గంలో మార్పు కాటారం నుంచే జరగాలని పుట్ట మధూకర్ అన్నారు. కాటారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన బైక్ ర్యాలీ, మల్హర్ మండలంలోని తాడిచర్ల ప్రచారంలో ఆయన భూపాలపల్లి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణితో కలిసి పాల్గొన్నారు. ధన్వాడ నుంచి కాటారం ప్రధాన కూడలి వరకు పార్టీ శ్రేణులు, అభిమానులతో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. గెలుపు కోసం కాంగ్రెస్ అభ్యర్థి ఎన్నో ఎత్తుగడలు వేస్తున్నాడని, సినీ నటి విజయశాంతిని మంథనికి తీసుకొచ్చినంత మాత్రాన ప్రజలు మోసపోరన్నారు. అభివృద్ధి, అభ్యర్థిని చూసి ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గానికి 5వేల ఇండ్లు తీసుకువచ్చి ప్రతి పేదవాడికి దగ్గరుండి ఇల్లు కట్టి చూపిస్తానని హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం వల్ల చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ఏనాడైనా పట్టించుకున్నాడా ? అని ప్రశ్నించారు. తనను గెలిపించాక ఆ ప్రాజెక్టు పూర్తి చేసి ఆయకట్టు భూములకు నీరందిస్తానని అన్నారు. జెన్‌కో సమస్యలు పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు.

### పుట్ట మధును ఆశీర్వదించాలి

నిత్యం ప్రజల్లోనే ఉంటూ కష్ట సుఖాలను పంచుకునే పుట్ట మధును ప్రజలు ఆశీర్వదించాలని భూపాలపల్లి జడ్పీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి కోరారు. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగకుండా భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేతలు జక్కు రాకేశ్, కర్రు నాగయ్య, మండల అధ్యక్షుడు తోట జనార్దన్, యూత్ అధ్యక్షుడు రామిల్ల కిరణ్, మహిళా అధ్యక్షురాలు సౌజన్యారెడ్డి, కే రాజబాబు, ప్రధాన కార్యదర్శి జోడు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రామచంద్రం, వెంకటస్వామి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు భూపెల్లి రాజు, ఎంపీటీసీ బాసాని రవి, చిట్యాల సమ్మయ్య, తైనేని సతీశ్, వినయ్‌రావు, స్వామి, మండల లయ్యారెడ్డి, దుర్గం తిరుపతి, విఠల్, కుమ్మరి అశోక్, రాజేంద్రచారి, రమేశ్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, జక్కు శ్రావణ్, రాజబాబు, శ్రీనివాస్, శంకరయ్య, రాజేశ్, దుర్గారావు, శ్రీలక్ష్మీ చౌదరి, మమత, బీఆర్ఎస్ మల్హర్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రామారావు, ఎంపీటీసీ కల్పన పాల్గొన్నారు.

# ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి



మీడియాతో మాట్లాడుతున్న నాగజ్యోతి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సీతారాంనాయక్

- ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా
- అందరి ఆశీస్సులు కావాలి
- విలేకరుల సమావేశంలో బడే నాగజ్యోతి
- ప్రజలు మోసపోతే గోస పడుతరు : ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి
- కాంగ్రెస్ మైండ్ గేమ్ ఆడుతుంది : మాజీ ఎంపీ సీతారాంనాయక్

ములుగురూరల్, నవంబర్ 28 : ములుగు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు సీఎం కేసీఆర్ ఎంతో నమ్మకంతో తనను బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిపారని, ప్రజలంతా మంచి చెడులను ఆలోచించి తనకు ఓటు వేసి గెలిపించాలని బడే నాగజ్యోతి అన్నారు. తమ ఇంటి ఆడబిడ్డలా భావించి తనకు ఓట్ల రూపంలో ప్రేమను పంచాలని తెలిపారు. తల్లిదండ్రులు లేకుండా సమాజంలో కష్టనష్టాలను ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానని, ప్రజల కష్టాలను తీర్చుతానని అన్నారు. సేవ చేసే అవకాశాన్ని సీఎం కేసీఆర్ కల్పించారని, దీనిని ములుగు నియోజకవర్గ ప్రజలంతా కాపాడి ఒక్క అవకాశం కల్పిస్తే ఈ ప్రాంత రుణం తీర్చుకుంటానని అన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం ములుగు ప్రాంతానికి ఎంతో మేలు చేసిందని, అందులో విద్య, వైద్య పరంగా అనేక మార్పులు చేపట్టారన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ ద్వారానే సాధ్యమైందన్నారు. ములుగులో గత, ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకొని ఓటు వేయాలన్నారు. పని చేసే వారికి అవకాశం ఇస్తే ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారాలు లభిస్తాయన్నారు. ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగిన తాను చిన్న నాటి నుండి ఇక్కడి ప్రాంత ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని జలాశయాల కాల్వలను సీసీతో బలోపేతం చేసి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తానని తెలిపారు. తాడ్వాయి మండలంలో అగ్రికల్చర్, ఫారెస్టు కళాశాలను ఏర్పాటు చేయడంతో పాటు ఏటూరునాగారంలోని డిగ్రీ కళాశాలను పీజీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయిస్తానని అన్నారు. చిన్నప్పుడే బుల్లెట్లకు బలయ్యేదానినని, అదృష్టం ఉండి బతికానంటే ఈ ప్రాంత ప్రజలకు చేయాల్సిన సేవ ఏదో మిగిలి ఉండడం వల్లనే మీ ముందుకు వచ్చానని నాగజ్యోతి భావోద్వేగానికి లోనయ్యారు. తాను పేదరికం నుంచి వచ్చానని, తన వద్ద డబ్బు లేదని, ములుగు నియోజకవర్గ ప్రజల ప్రేమాభిమానాలే తన ఆస్తి అని అన్నారు. గెలిపిస్తే నియోజకవర్గ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సేవ చేస్తానని బడే నాగజ్యోతి పేర్కొన్నారు.

### ములుగును నంబర్‌వన్ నియోజక వర్గం చేస్తా

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజలకు మంచి చేసే వారు ఎవరో, చెడు చేసే వారు ఎవరో ఆలోచించి బడే నాగజ్యోతికి ఓటు వేయాలని, మోసపోతే గోస పడతారని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా బీఆర్ఎస్‌కే మద్దతు తెలియజేయాలనే నిర్ణయానికి వచ్చారని, ములుగు నియోజకవర్గ ప్రజలు సైతం పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ములుగు ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ములుగు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేసే బాధ్యతను స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా తాను తీసుకుంటానని అన్నారు. నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపిస్తే ములుగు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నంబర్‌వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే అది సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. 2018 పరిస్థితిని ములుగు నియోజకవర్గంలో పునరావృతం కాకుండా ప్రజలంతా ఏకతాటిపైకి వచ్చి అభివృద్ధిపై నిలబడి బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టాలని కోరారు. విలేకరుల సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, వరంగల్ జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, ములుగు ఎంపీపీ శ్రీదేవీ సుధీర్‌యాదవ్, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు వీర్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### సర్వేల పేరుతో కాంగ్రెస్ మోసం

మాజీ ఎంపీ సీతారాంనాయక్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసేందుకు మైండ్ గేమ్ ఆడుతుందని, మోసపూరిత కుట్రలకు పాల్పడుతూ సర్వేల పేరుతో అధికారంలోకి వస్తుందని నమ్మబలికే ప్రయత్నం చేస్తుందని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ నేత సీతారాంనాయక్ అన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను 4 నుంచి 10శాతానికి పెంచి పోడు భూమల సమస్యను బీఆర్ఎస్ ప్రభుత్వమే పరిష్కరించిన విషయం గుర్తు చేశారు.



నర్సాపురంలో ప్రచారం చేస్తున్న తెల్లం వెంకట్రావు

## కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం

- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకట్రావు

దుమ్ముగూడెం, నవంబర్ 28 : సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని బీఆర్ఎస్ భద్రాచలం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నర్సాపురం, కొత్త మారేడుబాక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు. తెల్లంకు మహిళలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తెల్లం మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతవాసినైన తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కేసీఆర్ తీసుకొచ్చిన ప్రభుత్వ పథకాలు ప్రతి గడపకూ చేరాయని గుర్తుచేశారు. ఏజెన్సీ మండలంగా వెనుకబడి ఉన్నప్పుడు బీఆర్ఎస్ హయాంలో 55 ఏళ్లుగా నోచుకోని అభివృద్ధి 10 ఏళ్లలో రోడ్లు, వంతెనలు, సీసీ రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలతో ఏజెన్సీ మండలాన్ని అభివృద్ధి చేశారన్నారు. తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ప్రజలకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. ప్రజలు తనను ఆదరించి కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. తొలుత మండల పరిధిలోని నర్సాపురంలోని ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రాన్ని తెల్లం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, సాగి శ్రీనివాసరాజు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.